మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కలిసిన ఎంపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే

మున్సిపల్ వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే

బైంసా, ఏప్రిల్, 26 : పట్టణంలోని మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీర్ అహ్మద్‌ను ఆయన నివాసంలో గురువారం రాత్రి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే జోగురామన్న కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి సహకరించాలని కోరారు. అనంతరం జాబీర్ అహ్మద్ మాట్లాడుతూ ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ అభిప్రాయం మేరకే నడుచుకుంటామని తెలిపారు. ఈయన వెంట మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు ఉన్నారు.

బోథ్ ఎమ్మెల్యేకు స్వల్ప అస్వస్థత

చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, ఏప్రిల్ 26 : కొన్ని రోజులుగా తీరిక లేకుండా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వడదెబ్బ తగలడంతో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వైద్యుల సూచన మేరకు ప్రజలు, కార్యకర్తలకు రెండు రోజుల పాటు అందుబాటులో ఉండడం లేదని ఎమ్మెల్యే తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని సూచించారు. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ నాయకులు ఉన్నారు.

గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను వృద్ధురాలికి వివరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ప్రచార రథానికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- ఆ పార్టీని నమ్మితే మరోసారి మోసమే..
- ఆత్రం సక్కును ఎంపీగా గెలిపిద్దాం
- మాజీ మంత్రి జోగు రామన్న
- దుర్గా ఆలయంలో పూజలు
- ప్రచారం ప్రారంభం

ఎదులాపురం, ఏప్రిల్ 26 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే హామీలు అమలవుతాయని ఆ పార్టీ నేతలు అనడం మరోసారి ప్రజలను మోసం చేసేందుకేనని బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని దుర్గానగర్‌లోని నవశక్తి దుర్గా మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రచార రథానికి పూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం దుర్గానగర్‌తో పాటు పలు కాలనీల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకే ఓటు వేయాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మహిళలకు రూ.2500 పింఛన్, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం వంటి హామీలను బుట్టదాఖలు చేసిందని మండిపడ్డారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తేనే పథకాలు కొనసాగుతాయని వ్యాఖ్యలు చేయడం తగదని ధ్వజమెత్తారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించలేని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని, బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అలాల్ అజయ్, యూనుస్ అక్బనీ, సంద నర్సింగ్, ధమ్మపాల్, తుర్పటి భుమన్న, కొండ గణేశ్, స్వరూపారాణి, పర్విన్, దాసరి రమేశ్, విజ్జగిరి నారాయణ, పండ్లశ్రీను, వేనుకంటి ప్రకాశ్, సంజయ్ తదితరులు ఉన్నారు.

పునరావాస ఇండ్ల పరిశీలన

మద్దిపడగలో పునరావాస ఇండ్లను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ ఇలుసింగ్ మీర్, ఎఫ్డీపీటీ శాంతారాం

కడెం, ఏప్రిల్ 26: అటవీ ప్రాంత గ్రామాలైన రాంపూర్, మైసంపేట గ్రామస్తులకు కొత్తమద్దిపడగ గ్రామ సమీపంలో పునరావాసంలో భాగంగా ఇండ్లను నిర్మించగా వాటిని శుక్రవారం విజిలెన్స్ పీసీసీఎఫ్ ఇలుసింగ్‌మీర్, ఎఫ్డీపీటీ శాంతారాం ఇండ్లను పరిశీలించారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోని వివిధ రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లోని గ్రామాలను క్రమంగా ఒక్కొక్కటిగా ఖాళీ చేయించి వారికి మెరుగైన పునరావాసం, సౌకర్యాలను కల్పించాలని అటవీ శాఖ అధికారులు భావించారు. ఇందులో భాగంగా మొదట కడెం మండలంలోని రాంపూర్, మైసంపేట గ్రామాలను ఖాళీ చేయించారు. 96 మందికి ఇండ్ల నిర్మాణంతో పాటు, వ్యవసాయ భూమిని కేటాయించారు. ఈ మేరకు లబ్ధిదారుల అభిప్రాయాలను, సౌకర్యాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎఫ్డీవో భవాని శంకర్, కడెం ఎఫ్ఆర్వో అనిత, డీఆర్వో, ఎఫ్‌బీవో, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతాం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

- మేడే పోస్టర్ విడుదల

ఎదులాపురం, ఏప్రిల్26 : కేంద్రంలోని బీజేపీ సర్కారు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వెంకటనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 138వ మేడేను జయప్రదం చేయాలని పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశంలో పదేళ్ల పాటు బీజేపీ ప్రభుత్వం పాలనలో పరిశ్రమలు మూతపడడంతో అనేక మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను కట్టుబానిసలుగా చేస్తున్నదన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చి రైతులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సుభాష్, దత్తు, నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు అర్క శేషారావు, ఉపాధ్యక్షుడు సంజయ్, అఖిల్, నాయకులు విశాల్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేశ్ తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలో తనిఖీలు ముమ్మరం

రైల్వేస్టేషన్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఎదులాపురం, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. జిల్లాలో మద్యం, గంజాయి, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు శుక్రవారం ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేశారు. మాదకద్రవ్యాలను సంపూర్ణంగా నిర్మూలించాలనే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో ఆదిలాబాద్ రైల్వేస్టేషన్, పరిసరా ప్రాంతాలు, ఠాకూర్ హోటల్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు చెప్పారు. మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా సరిహద్దున ఉన్న లక్ష్మీపూర్, మండ్వీ, పిప్పల్‌గావ్‌పాట వద్ద ఉన్న చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. 24 గంటల పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అక్రమంగా తరలించే డబ్బు, మద్యం, గంజాయి, ఓటర్లను ప్రభావితం చేసే బహుమతులు అనుమతించవద్దన్నారు. తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ నిర్వహించాలన్నారు. ఈ తనిఖీల్లో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, టూటౌన్ సీఐ ఏ అశోక్ ఉన్నారు.

పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం

హోంగార్డు కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందిస్తున్న ఎస్పీ, బ్యాంకు అధికారులు

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 26 : విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. శుక్రవారం నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హోంగార్డు మాసం కిరణ్ గతేడాది సెప్టెంబర్ 27న మంజులాపూర్‌లో గణపతి విగ్రహాల మండపాలను తనిఖీ చేసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మరణించాడు. యాక్సిస్ బ్యాంకు సాలరీ అకౌంట్‌కు మంజూరైన ప్రమాద బీమా పరిహారం రూ.30 లక్షల చెక్కును, ఇద్దరు పిల్లల భవిష్యత్ కోసం ఒక్కొక్కరికీ రూ.4 లక్షల చొప్పున రూ.8 లక్షల చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆమె అందజేశారు. బీమా అందించిన బ్యాంకు యాజమాన్యానికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. హోంగార్డు కుటుంబానికి బీమా లబ్ధి పొందేలా కృషి చేసిన ఆర్ఐ రామ కృష్ణ, శైలేందర్, హోంగార్డు ఆసిఫ్, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఏవో యూనుస్ అలీ, రూరల్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

వరి ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

నమస్తే ఎఫెక్ట్

ఖానాపూర్, ఏప్రిల్ 26: ఈ నెల 22న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'కిలో ధాన్యం కొనలే' కథనానికి అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు స్పందించారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఖానాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో యాసంగి వరి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ. 2183లు చెల్లిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తాలు, తప్పా పేరుతో తూకంలో కోతలు విధించవద్దని రైతులు కోరారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

- నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

సోన్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా హైవేల వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు సిబ్బందిని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశించారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ హైవే వద్ద వాహనాలను తనిఖీ చేసి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. తల్వేద నుంచి నిర్మల్ వైపునకు అక్బర్ అనే వ్యక్తి మోటారు సైకిల్‌పై పీడీఎస్ బియ్యాన్ని తీసుకెళ్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశారు. డీఎస్పీ గంగారెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాయి కుమార్, ఏఎస్ఐ దేవన్న ఉన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 26 : ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం కోల్హారి గ్రామ సమీపంలో ఇచ్చోడ-సోనాల ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిపై చేపడుతున్న నూతన వంతెన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ డీఈ సునీల్ సూచించారు. శుక్రవారం కోల్హారి గ్రామంలో చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను క్యూసి అరుణ్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు.

కోల్హారి వంతెన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ

13 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం

10 మంది నామినేషన్ల తిరస్కరణ

నామినేషన్ల వివరాలు వెల్లడిస్తున్న సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

ఆదిలాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ల ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షి షా, అధికారులు పరిశీలించారు. ఎంపీ స్థానానికి మొత్తం 23 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లతో పాటు ఇతర పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులకు చెందిన 13 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. 10 మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. 42 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా 27 సెట్లు సక్రమంగా ఉన్నాయని అధికారులు గుర్తించగా, 15 సెట్ల నామినేషన్లను తిరస్కరించారు. బీజేపీ నుంచి నామినేషన్ వేసిన రాథోడ్ రమేశ్, కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అత్రం భాస్కర్‌తో పాటు మరో 8 మంది నామినేషన్లను అధికారులు తిరస్కరించారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నిర్మల్ కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

హాజరైన అధికారులు

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాలని నిర్మల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సెక్టోరల్ అధికారులకు ఈవీఎం యంత్రాల పనితీరు, ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఎన్నికలకు ముందే సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి వారికి కేటాయించిన రూట్ మ్యాప్‌ను సరి చూసుకోవాలని ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, విద్యుత్ ఫర్నిచర్ వంటి సౌకర్యాలను పరిశీలించాలని తెలిపారు. ఎన్నికల రోజున తప్పకుండా మాక్ పోలింగ్‌లో పాల్గొనాలని ఆదేశించారు. పోలింగ్ తర్వాత కచ్చితంగా సీఆర్సీ ప్రక్రియను చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య, పోలింగ్ అధికారులకు సంబంధించిన పేరు సెల్ నంబర్లతో కూడిన సమాచారాన్ని ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికీ మూడు సెట్ల ఈవీఎంలు అందజేస్తామని తెలిపారు. పోలింగ్ సమయంలో సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని రెండు సార్లు సందర్శించాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు ఈవీఎంల పనితీరు, ఎన్నికల్లో సెక్టోరల్ అధికారుల విధులపై వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో భుజంగ్‌రావు, నిర్మల్, బైంసా, ఉట్నూర్ ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, జీవాకర్, సెక్టోరల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు చేయాలి

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 9న నిర్వహించనున్న గ్రూప్ -1 పరీక్షకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆయన గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, సీసీ కెమెరాలు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఆర్టీసీ బస్సు సౌకర్యం వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరీక్ష జరిగే సమయంలో 200 మీటర్ల లోపు జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ పత్రాల తరలింపు సమయంలో పోలీసు శాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది మందులు, ఓఆర్ఎస్ పాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో నిర్మల్, బైంసా ఆర్డీవోలు రత్న కల్యాణి, కోమల్ రెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.